వరదొస్తే పడవెక్కాల్సిందే!

తోట్లవల్లూరు–పాములలంక మధ్య కృష్ణానదిపై వంతెన నిర్మాణం కలగా మారింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత కారణంగా వంతెన నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమై వెక్కిరిస్తోంది. కృష్ణానదికి వరద వచ్చినప్పుడల్లా తమకు కష్టాలు తప్పటం లేదని పాములలంకతో పాటు పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- లంకవాసుల కష్టాలు తీరేదెన్నడో?
- ప్రతి ఏటా నాలుగు నెలలు పడవలపైనే రాక పోకలు

కృష్ణానదిలో పడవపై రాకపోకలు సాగిస్తున్న పాములలంక గ్రామస్తులు





పడవపై తోట్లవల్లూరు రేవుకు చేరుకుంటున్న విద్యార్థులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో పాములలంక ఉంటుంది. కృష్ణానది గర్భంలో ఉన్న ఈ గ్రామంలో సుమారు 1500పైగా జనాభా ఉంటారు. వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తుంటారు. తోట్లవల్లూరు–పాములలంక మధ్య వంతెన కోసం కొన్నేళ్లుగా ఆశతో ఎదురు చూస్తున్నారు. వంతెన నిర్మాణం జరిగితే తమకు వరద కష్టాలు తీరుతాయనే ఆశతో ఉన్నారు.

శంకుస్థాపన చేసినా..

కృష్ణానదిపై వంతెన నిర్మాణం కోసం 2014 ఎన్నికల ముందు అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే డీవై దాస్ రూ. 13.50 కోట్ల అంచనాలతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టీడీపీ హయాంలో రూ. 30 కోట్ల వ్యయంతో వంతెన నిర్మిస్తున్నట్లు అప్పటి ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన హడావుడి చేసినా ఫలితం లేదు.

వరదొస్తే కష్టాలే..

కృష్ణానదికి వరదొస్తే లంక గ్రామాలకు కష్టాలు తప్పటం లేదు. ప్రతి ఏడాదీ ఆగస్టు నుంచి నవంబరు వరకు నదిలో వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది. దీంతో లంక గ్రామాలైన రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంక, వల్లూరుపాలెం శివారు కాళింగదిబ్బలంక, పాములలంక, తుమ్మలపచ్చిక లంక, దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంక, ఐలూరు శివారు కనిగిరిలంక గ్రామాలకు పడవలపైనే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. రాత్రిళ్లు ఏదైనా ప్రమాదానికి గురైనా, అనారోగ్యం బారినపడినా పడవల్లోనే ఇవతలి ఒడ్డుకు వచ్చి ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే చిరుద్యోగులు నదిలో ఎంత వరద ఉన్నా ప్రమాదకర పరిస్థితులలో పడవలపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

వంతెనతో ఉపయోగాలు..

కృష్ణానదిపై వంతెన నిర్మాణంతో పాములలంకతో పాటు తుమ్మలపచ్చికలంక, కాళింగదిబ్బలంక, తోడేళ్ల దిబ్బలంక, పొట్టిదిబ్బలంక గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు సులభతరంగా తరలించేందుకు అవకాశం ఉంటుంది. వరద తగ్గుముఖం పట్టాక రాకపోకలు సులభతరంగా ఉండటంతోపాటు లంకల్లో పండించే వాణిజ్య పంటలైన అరటి, కంద, తమలపాకు, చెరకు, కూరగాయల రవాణకు ఎంతో అనువుగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణంపై దృష్టి సారించి తమ కష్టాలు తీర్చాలని లంకగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు



కృష్ణానదికి వరద వచ్చిన ప్రతిసారీ మాకు కష్టాలు తప్పటం లేదు. నాలుగు నెలలపాటు పడవలపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మాకు ఎన్నాళ్లీ కష్టాలు. వంతెన నిర్మాణం జరిగితే మాకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. పాలకులు వంతెన నిర్మాణంపై దృష్టి సారించాలి.

– శీలం వెంకటేశ్వరరావు, పాములలంక

ఆశతో ఎదురు చూస్తున్నాం



కృష్ణానదిపై వంతెన నిర్మాణం కోసం కొన్నేళ్లుగా ఆశతో ఎదురు చూస్తున్నాం. మా ఆశలు అడియాశలుగానే మారుతున్నాయి తప్ప వంతెన నిర్మాణం మాత్రం జరగటం లేదు. వంతెన నిర్మాణంతోనే లంక ప్రజల కష్టాలు తీరుతాయి.

– పాముల అర్జున్, పాములలంక

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి

జూనియర్ సివిల్ జడ్జి శివకిరణ్



కైకలూరు భవిత కేంద్రంలో దివ్యాంగులతో జడ్జి శివకిరణ్

కైకలూరు: దివ్యాంగులపై వివక్ష చూపకుండా ప్రేమతో ఆదరించాలని కైకలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.శివకిరణ్ పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులు, తల్లిదండ్రులకు మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పానల్ న్యాయవాది పి.పవన్‌కాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం దివ్యాంగులు రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం షాఫియా అనే రెండో తరగతి బాలికకు సదరన్ సర్టిఫికెట్ రాలేదని చెప్పడంతో.. అది పొందే విధంగా కృషి చేస్తానన్నారు. ఎంఈఓ డి.రామారావు, బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎంఎస్ఎస్.రాజు, భవిత కేంద్ర ఐఈఆర్‌టీ టీచర్లు జి.వెంకటలక్ష్మి, సుధాకర్, అరుణ, ఎంఎల్ఎస్‌సీ కో–ఆర్డినేటర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించండి



రికార్డులు తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి

గుడివాడ టౌన్: సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత హాస్టల్ అధికారులదేనని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. అంగలూరు సాంఘిక సంక్షేమశాఖ బాలికల హాస్టల్లో సోమవారం తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వసతుల వివరాలు విద్యార్థుల నుంచి రాబట్టామని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

అన్న క్యాంటీన్ల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



అన్న క్యాంటీన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

గుడివాడ టౌన్: పట్టణంలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ల వసతులను జిల్లా కలెక్టర్ బాలాజీ సోమవారం రాత్రి పరిశీలించారు. స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్ వద్ద, రామబ్రహ్మం పార్కు వద్ద రెండు క్యాంటీన్ల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈనెల 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్డీఓ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం సృష్టించొద్దు



చిరు వ్యాపారులను పక్కకి వెళ్లమని చెబుతున్న ఎస్ఐ ప్రసాద్

గుడివాడరూరల్: పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ట్రాఫిక్ అంతరాయం కారణమవుతున్న తోపుడుబళ్లపై ట్రాఫిక్ పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల మీదకు వచ్చిన తోపుడుబళ్లను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చిరు వ్యాపారాలు నిర్వహించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. తాము చిరు వ్యాపారులకు ఇబ్బంది కలిగించడం లేదని, రోడ్లపై ఉన్న తోపుడుబళ్లను ట్రాఫిక్‌కు ఇబ్బందుల తలెత్తకుండా పక్కకు మాత్రమే జరుపుతున్నామని ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. పట్టణంలో వాహనాల రద్దీ భారీగా పెరిగిన నేపథ్యంలో వాహనదారులతో పాటుగా చిరు వ్యాపారులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రవేశపెట్టిన ఐలవ్ గుడివాడ ప్రాజెక్టులో తాము కూడా భాగస్వాములవుతూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం



గుడివాడలో రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుడివాడ టౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల్లో సోమవారం గ్రంథ పాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహిస్తారన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి డాక్టర్ రంగనాథన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల్లో గ్రంథాలయ పాత్ర అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు ప్రత్యేష, వి.సువర్ణలక్ష్మి, బి. సుభాషిణి, గోపి పాల్గొన్నారు.

రంగనాథన్ సేవలు చిరస్మరణీయం

కైకలూరు: గ్రంథాలయోద్యమంలో డాక్టర్ ఎస్ ఆర్.రంగనాథన్ సేవలు చిరస్మరణీయమని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పేర్కొన్నారు. నేషనల్ లైబ్రేరియన్స్ డే సందర్భంగా కాలేజీలో సోమవారం రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.వేదాంతం, ఎన్.శ్రీనివాసరావు, ఎం.హరిప్రసాద్, రంగరావు, రవికుమార్, శివనాగరాజు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు



పసుమర్రు(పామర్రు): సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని పసుమర్రు గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అక్కడ ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, వాటి వివరాలను సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ సక్రమంగా అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ నాగేంద్రరావు, గ్రామ కార్యదర్శి పద్మశ్రీ వేణి, పార్టీ నాయకులు వల్లూరిపల్లి గణేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

గుడ్లవల్లేరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ గుడివాడ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి నాయకులు బైక్ ర్యాలీని నిర్వహించారు. సోమవారం గుడ్లవల్లేరు శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి వడ్లమన్నాడు వరకు ఈ ర్యాలీని చేపట్టారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోహనరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొట్లూరి రవి, బీజేపీ మండల అధ్యక్షుడు రవీంద్ర, జనసేన మండల అధ్యక్షుడు తోట చిన్నారి పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గుడివాడ టౌన్: పట్టణాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక 35వ వార్డులో సోమవారం ఆయన శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో కలిసి రోడ్లపై చెత్తను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల నిరసన



ముదినేపల్లి రూరల్: ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి చేపట్టిన కౌన్సెలింగ్ ప్రక్రియను వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు సోమవారం బాయ్‌కాట్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి చెప్పినటువంటి ఏ అంశాన్నీ పరిగణనలోనికి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రక్రియను అత్యవసరంగా చేపట్టి ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నట్లు ఆరోపించారు. ఇందుకు నిరసనగా బాయ్‌కాట్ చేస్తున్నట్లు సంఘాల నేతలు తెలిపారు.

ఎంపీడీఓకు ఘనంగా వీడ్కోలు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణ బదిలీ అయ్యారు. ఎన్నికల ముందు ఆయన గుంటూరు జిల్లా కొల్లూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయన్ను మళ్లీ కొల్లూరు మండలానికే జిల్లా అధికారులు బదిలీ చేశారు. దీంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళుతున్న ఎంపీడీఓను కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యాలయ ఏఓ ఉషారాణి, కార్యదర్శులు సత్యనారాయణ, సుభాష్‌కుమార్, శైలజ, మురళీకృష్ణ సత్కరించిన వారిలో ఉన్నారు.

పామర్రులో..

పామర్రు: బదిలీపై అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం మండలానికి వెళ్లిన ఎంపీడీఓ భారతిని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ , వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు, కార్యాలయం సూపరింటెండెంట్ ప్రమీళ, పీఆర్ ఏఈ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: గుడివాడ ఎంపీడీఓ కె.జ్యోతి సోమవారం వెస్ట్‌గోదావరికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ విధుల నిర్వహణలో తనకు సహకారాలు అందించిన అధికారులు, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. కాగా గుడివాడ ఎంపీడీఓగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

మొవ్వలో..

మొవ్వ: ఈ ఏడాది మార్చిలో మొవ్వ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ గుంటూరు భట్టిప్రోలుకు బదిలీ అయ్యారు. గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వర్తించి వెస్ట్ గోదావరి బదిలీపై వెళ్లిన సుధాప్రవీణ్ తిరిగి మొవ్వకు వస్తున్నారు.

మండవల్లిని గ్రేడ్–1 పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయాలి

మండవల్లి: మండవల్లి పంచాయతీని గ్రేడ్–3 నుంచి గ్రేడ్–1కు అప్‌గ్రేడ్ చేసి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి అప్పారావు సోమవారం మీకోసం కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఎనిమిది వేల జనాభా గల పెద్ద పంచాయతీగా మండవల్లి పంచాయతీ ఉందని, వార్షిక ఆదాయం రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉందని పేర్కొన్నారు. పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ రెండేళ్ల నుంచి ఖాళీగా ఉందని తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

కూచిపూడి(మొవ్వ): అయ్యంకి గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రమణ్యం తన సిబ్బందితో ఆదివారం మెరుపు దాడి నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడిలో అయ్యంకి, చినముత్తేవి గ్రామాలకు చెందిన ఏడుగురు జూదరులు, ఒక కోడిని, నాలుగు కోడి కత్తులతో పాటు రూ.3,460ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

కొండిపర్రు(పామర్రు): కొండిపర్రు గ్రామం నుంచి విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి కలిసే ప్రదేశంలో జరుగుతున్న ప్రమాదాలను నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని పామర్రు ఎస్ఐ అవినాష్‌ను కొండిపర్రు గ్రామస్తులు సోమవారం కోరారు. పామర్రు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అవినాష్‌ను తొలుత గ్రామస్తులు సత్కరించారు. గ్రామస్తులు నూకారపు వీరాంజనేయులు, పసుపులేటి విజయ్‌కుమార్, కిరణ్, చిరంజీవి, సువర్ణరాజు, దినేష్ ఫణికుమార్, సుకుమార్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను తెలియచేయడం, ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు స్వీకరించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పాల్గొనదలచిన వారు 99592 25464లో సంప్రదించాలని కోరారు.

ఫార్మాలో అవకాశాలను వినియోగించుకోవాలి

గుడ్లవల్లేరు: ఫార్మా పరిశ్రమల్లో వచ్చే అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని పూణె గ్లాటన్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి జి.కిరణ్‌కుమార్ అన్నారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో సోమవారం అడ్వాన్స్‌మెంట్ ఇన్ గ్రాన్యులేషన్ టెక్నిక్స్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఆ కాలేజీ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, కో–ఆర్డినేటర్స్ డాక్టర్ పి.రవీష, డాక్టర్ టి.బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సర్దుబాటు'ను నిలిపివేయాలి

గుడివాడ టౌన్: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన సర్దుబాటు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డి.చంద్రశేఖర్, జిల్లా శాఖ అధ్యక్షుడు పి.ఇమ్మానుయేల్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్దుబాట్ల ప్రక్రియను టీచర్ ఇన్ఫర్మేషన్ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో వివరాల సేకరణ పేరుతో సర్దుబాటు తప్పులతడకగా మారిందని పేర్కొన్నారు.

'సర్దుబాటు' ప్రక్రియ బహిష్కరణ

కైకలూరు: మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తూ కలిదిండి ఎంఈఓ రవిప్రకాష్‌కు ఆయన కార్యాలయంలో ఫ్యాప్టో సంఘ నాయకులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. కౌన్సెలింగ్‌నకు ఎవరూ హాజరుకావద్దని కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాగర్, మండల గౌరవాధ్యక్షుడు రాజామోహన్, మండల ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, టెన్నీసన్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ దాడులపై ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలి

కైకలూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని కోరుతూ కైకలూరులోని హిందువులు సోమవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులను అతికిరాతకంగా చంపుతున్నారన్నారు. ఐక్యరాజ్యసమితిలో బంగ్లాదేశ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కలిదిండిలో హిందు సంఘాలు ర్యాలీ చేశాయి. హిందు సంఘ నాయకులు కీర్తి వెంకటరామ ప్రసాద్, యానాల బసవయ్య, మేడిశెట్టి పాములు, పి.పవన్‌కాంత్, శేషగిరి, శ్యామలరాజు, క్రాంతి, సత్యనారాయణ, ప్రసాద్, పూర్ణ చంద్రరావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలి

పామర్రు: ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని లేని పక్షంలో వారిపై తగు చర్యలు చేపడతామని పామర్రు ఏడీఏ స్వర్ణలత పేర్కొన్నారు. స్థానిక మన గ్రోమోర్ సెంటర్‌లో ఎరువులను ఏఓ శివనాగరాణితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువుల ధరల బోర్డును రోజు అప్‌డేట్ చేయాలన్నారు. మండలంలో యూరియా 340.200 మెట్రిక్ టన్నులు, డీఏపీ 163 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

గుడివాడరూరల్: జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బిళ్లపాడు గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,620 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

పామర్రు: పాల ఉత్పత్తిదారులకు అదనపు బోనస్‌గా రూ.3.27 లక్షలను పంపిణీ చేసినట్లు పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక చిన్న పాల సేకరణ కేంద్రంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎక్కువ పాలు పోసి మొదటి బహుమతి సాధించిన టీ అంజిరెడ్డికి రూ.8,437, ద్వితీయ బహుమతిని ఎం.వెంకటేశ్వరరావు రూ.7,444ను పొందారని తెలిపారు. కార్యక్రమంలో పాల శీతల కేంద్రం మేనేజర్ దామోదర కృష్ణగోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

పామర్రు: నేషనల్ లెవల్ కుంగుఫూ, కరాటే ఓపెన్ చాంపియన్ కప్ పోటీలలో ఆసీస్సీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చివిజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ వలసా సబాస్టన్ అన్నారు. స్థానిక ఆసీస్సీ హైస్కూల్లో విజేతలను సోమవారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించిన ఈ పోటీల్లో కటా కుమితి విభాగంలో కె నిహంత్ ప్రథమ స్థానం, ఎ.చైత్ర సాయి ద్వితీయ స్థానం సాధించి విజేతలుగా నిలిచారన్నారు.

వ్యవసాయ పనులను 'ఉపాధి'లో అనుసంధానం చేయాలి

గుడ్లవల్లేరు: వ్యవసాయ పనులను ఉపాధి హామీ పథకంలో అనుసంధానం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సీఎల్ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ల శాఖా సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి మాట్లాడినట్లు ఆయన పేర్కొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

రాపర్ల(పామర్రు): నేషనల్ లెవల్ కుంగ్–ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని మదర్‌థెరిస్సా స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పయాకోబ్ తెలిపారు. రాపర్ల గ్రామంలోని మదర్ థెరిస్సా పాఠశాల్ల విజేతలను సోమవారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగిన ఈ పోటీల్లో జీ సిద్ధార్థ, వీ ఆకాష్, లౌకిక, జీవన్‌లు మొదటి బహుమతి గెలుచుకుని స్వర్ణ పతకి సాధించారని తెలిపారు. బువనేష్, జయవర్ధన్ కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం ఆయన కౌన్సిల్ సమావేశం హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు.

రహదారుల భద్రతపై అవగాహన

గుడ్లవల్లేరు: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయటం వలన నిండు జీవితాలు అతలాకుతలం అవుతాయని గుడివాడ మోటార్ వెహికల్ తనిఖీ అధికారి ఎం.సంగీతరావు అన్నారు. శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో రహదారుల భద్రతపై ఆటో డ్రైవర్లు, విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

కైకలూరు: ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గోపవరం సర్పంచ్ ఉలిసి వసంతకుమారి పేర్కొన్నారు. వైద్యశాఖ, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో సోమవారం దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. వైద్యశాఖ సిబ్బంది శ్రీనివాసరావు, స్కూల్ హెచ్ఎం కె.గ్లోరి, అంగన్‌వాడీ టీచర్ పి.సుజాత, ఎంపీహెచ్ఈఓ కె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

మండవల్లి: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటనాగలక్ష్మి ఆధ్వర్యంలో లింగాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, స్టాప్ సెంటర్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గూర్చి మహిళలకు అవగాహన కల్పించి చట్టాలను వివరించారు. హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో బుర్రకథ

మండవల్లి: మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం సాయంత్రం గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో గొర్రెల రాము, కృష్ణ బ్రదర్స్ బుర్రకథ నిర్వహించారు. మహాభారతంలోని ఉత్తర కల్యాణంతో పాటు గెయిల్ ఇండియా ఏర్పాటు చేసిన సహజవాయువు పైపులైన్లు, వాటి రక్షణ కోసం ఏర్పాటు చేసిన వాల్వులు, యంత్రాల్లో ఒక్కటి పాడు చేయకుండా కాపాడుకోవాలని ఇది మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు.